# ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్
- జిల్లాలో 12,16,898 మంది ఓటర్లు
- 90 శాతం ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి
- నియోజకవర్గంలో 5 మోడల్ పోలింగ్ బూత్‌లు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం, నవంబర్ 24: జిల్లాలో శాసనసభ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ స్టేసన్లలో ఓటర్లకు అవసరమైన అన్ని మౌలిక వసతుల కల్పనను పూర్తి చేసి సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 12,16,898 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో ఇప్పటికే 90 శాతం మందికి స్థానిక బీఎల్‌వోల ద్వారా ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి చేశామన్నారు. ఖమ్మం నగరంలో ఇంకా స్లిప్పుల పంపిణీ కొనసాగుతుందన్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారికి కూడా ఓటర్ స్లిప్ అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఓటరు జాబితాలో పేర్లు ఉండి ఓటర్ స్లిప్పులు రిటన్ చేసిన 36వేల మందికి పైగా ఏ ఐస్ డీ ఓటర్లుగా గుర్తించామని, వారు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వస్తే ఎన్నికల సంఘం సూచించిన రెండు గుర్తింపు కార్డులు చూపించి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఇంకా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు సిబ్బంది ఉన్నారని తెలిపారు. పూర్తి పారదర్శకంగా సీసీ కెమెరాలు, వీడియో రికార్డ్ ద్వారా పోలింగ్ నిర్వహించామన్నారు. ఇప్పటికే 58 వేల మందికి ఓటరు ఎపిక్ కార్డ్స్ కొత్తగా వచ్చాయని, వారికి కార్డ్స్ పంపిణీ పోస్టల్ ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంఎఫ్ ప్లస్‌ను పోలింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా1456 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల పరిశీలన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ద్వారా విద్యార్థులతో తల్లిదండ్రులకు ఓటు అవగాహన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే వెంటనే సి విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు.

## ఇదే మన గుర్తు.. గుర్తుంచుకోండి అక్కలు..



ఖమ్మం నగరంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా డమ్మీ ఈవీఎంలో కారు గుర్తు చూపుతూ అక్కా మరోసారి ఆశీర్వదించండి అంటూ ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ ఖమ్మం ఎమ్మెల్యే అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్

## పెద్దన్న.. హారతి ఇస్తాం.. ఆశీర్వదిస్తాం..



కొత్తగూడెం పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న వనమాకు హారతి ఇచ్చి ఆశీర్వదిస్తున్న బీఆర్ఎస్ మహిళా నేతలు, ప్రజలు

## అన్నా.. విజయతిలకం దిద్దుతున్నా..



సారపాకలో ప్రచారానికి వచ్చిన రేగాకు బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న మాధవీలత

# కారు జోరు.. ప్రచార హోరు..

## ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థుల విస్తృత ప్రచారం

'జై కేసీఆర్.. జైజై కేసీఆర్.. కారు గుర్తుకే మన ఓటు..' అంటూ గల్లీగల్లీలో హోరెత్తిన నినాదాలు. పల్లెలు, పట్టణాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల రోడ్ షోలు, సభలు, ఆత్మీయ సమావేశాలు. ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గడప గడపకూ తిరుగుతూ తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు. ప్రస్తుత అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే.. సంక్షేమ పథకాలు మరిన్ని రావాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. –నమస్తే నెట్‌వర్క్

## అవ్వా.. నాన్నకు ఓటేయి పింఛన్ డబులొత్తయి..



చింతకాని మండలం నాగిలిగొండలో కమల్‌రాజు విజయాన్ని కాంక్షిస్తూ వృద్ధులకు మ్యానిఫెస్టోలో అంశాలు వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న కుమార్తె అభిజ్ఞ

## అన్నా.. నీ చెల్లిగా అడుగుతున్నా మరోసారి ఆశీర్వదించు



కారేపల్లి మండల ప్రచారంలో ఓ దివ్యాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియానాయక్

# బీఆర్ఎస్‌తోనే మధిర అభివృద్ధి సాధ్యం

- భట్టికి ఈ ప్రాంత సమస్యలపై కనీన అవగాహన లేదు
- కమీషన్లు తప్ప విక్రమార్కకు ప్రజల సమస్యలు పట్టవు
- ముదిగొండ పర్యటనలో బీఆర్ఎస్ అభ్యర్థి కమల్‌రాజు

ముదిగొండ, నవంబర్ 24: మధిర నియోజవర్గ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ స్పష్టం చేశారు. ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచిన భట్టి విక్రమార్కకు ఇక్కడి సమస్యలపై కనీస అవగాహన లేదని అన్నారు. కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు తీసుకోవడం తప్ప ఆయనకు నియోజకవర్గ ప్రజల సమస్యలు పట్టవని విమర్శించారు. ముదిగొండ మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. కమలాపురం, అయ్యగారిపల్లి, మల్లారం, వల్లభి గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలను సమస్యల గురించి తెలుసుకోని ఆయన.. ఎక్కడో పాదయాత్ర చేసి వారి సమస్యలు తీరాస్తానని హామీలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. కేవలం కమీషన్లు ఇవ్వలేదనే కారణంతో అనేక ప్రాజెక్టులను ఆయన అర్ధాంతరంగా నిలిపివేయించారని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తికి మధిర ప్రజలు మరోసారి అవకాశం ఇవ్వకూడదని అన్నారు. ఈ ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని కోరారు. గత ఎన్నికల్లో తాను ఇక్కడ గెలవకపోయినా సీఎం కేసీఆర్‌తో చర్చించి ఈ నియోజకవర్గమంతా దళితబంధు అమలు చేసేందుకు కృషిచేశానని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. తాను గెలిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, సామినేని హరిప్రసాద్, పసుపులేటి దుర్గ, పోట్ల ప్రసాద్, పోట్ల కృష్ణకుమారి, మందరపు ఎర్ర వెంకన్న, బత్తుల వీరారెడ్డి, బత్తుల అమల, తోట ధర్మారావు, ఏలూరి రమేశ్, సామినేని వెంటేశ్వర్లు, గడ్డం వెంకటేశ్వర్లు, స్వాతి, బంక మల్లయ్య, రాంబాబు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న జన సందోహం

# ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల అధికారులు

ఖమ్మం రూరల్, నవంబర్ 24: మండలంలోని పొన్నెకల్ పరిధిలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఎన్నికల అధికారులు పరిశీలించారు. శుక్రవారం కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్, ఎన్నికల సాధారణ పరిశీలకులు తుశార్ కాంత మహంతితో పాటు పోలీస్ పరిశీలకులు బ్రిజేష్‌కుమార్ రాయ్, మంజునాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసే గదులను, పార్కింగ్ ప్రదేశాలు, భద్రతపరమైన అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ డీ మధుసుదన్‌నాయక్, డీడబ్ల్యూవో టీ సుమ, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ శ్రీనివాసులు, శ్యాంప్రసాద్, ఏసీపీలు బస్వారెడ్డి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు